

# సత్యాగ్రహం

— లలిత —

ఆముక్త మాల్యద ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దన వ్రాసి కృష్ణదేవరాయల పేర వెలయించాడనీ; క్రీడాభిరామం శ్రీనాథ కవిసార్వభౌముడు వ్రాసి వల్లభ రాయనిపేర వెలయించాడనీ, కన్యాశుల్కం అప్పారావుగారు కాక అన్యులెవరో వ్రాశారనీ; సారస్వత రంగంలో అపవాద తరంగాలున్నాయి. కృతి - కర్తృత్వం గురించిన వివాదాలు లోకంలో సహజ-!

అటాంటప్పుడు, సత్యాగ్రహం అన్న వుద్యమానికి కారకులు గాంధీజీ అని యేకగ్రీవంగా యెందుకంగీకరించాలి? మరొకరెందుకు కారకులు కారాదు? వచ్చు! కావచ్చు! కనుక, వచ్చిన-తెలియవచ్చిన కారణాలు, ఉపపత్తులూ, ఉదాహరణ పూర్వకంగా వివరించే, నా ప్రతిపాదనను నేను బలపరుస్తాను.

సత్యాగ్రహం అంటే యేవిటి? ఆగ్రహం అంటే యీనాడు "కోపము" అనే అర్థంలో వ్యవహరిస్తున్నారు. కాని భాషాచరిత్రలో అర్థవిపరిణామము పరిశీలిస్తే; ఒకప్పుడొక అర్థంలో వినియుక్తమైన పదం, కొన్నాళ్లకు మారి, మరోలా వాడబడుతుందని-తెలుస్తుంది. విపరిణమించిన పదాలలో "ఆగ్రహం" కూడా వొకటి! ఆదిలో, ఆగ్రహం అంటే పట్టుదల అని అర్థం.

కోపం వచ్చినప్పుడు పట్టుదలలు పెరుగుతాయి. కనుక, ఆగ్రహానికి కోపం అనే అర్థ విపరిణామం సంభవించింది. ఇక, సత్యాగ్రహం అంటే సత్యం కోసం ఆగ్రహం అనే యెందుకు చెప్పుకోవాలి?

సత్యకి వచ్చిన ఆగ్రహం అని యెందుకు అనుకోకూడదు? అనుకుని తీరాలి! అదే సమంజసం కూడా! ఆవిడికి యిష్టం లేని యే పని జరిగినా, జరుగుతుందని తెలిసినా ఆగ్రహం వచ్చేది.

రాగానే, అలుక కొనసాగించేది. ఆ మానవతికి యెప్పుడెందు కెలా కోపం వస్తుందో, అన్నీ తనకి తెలుసునని అహంకరించే ఆ లీలా మానుష విగ్రహుడికి సైతం తెలియని కిటుకు! తెలిసే అవకాశం యేదీ? స్వంతంగా ఆలోచిస్తే కదా తెలియడం? అతను స్వ-ఇచ్ఛా-అనుసారి కాడు. సత్యావిధేయుడు. (సత్య + అవిధేయుడు అని విసంధి చెయ్యకండి. పాపం వస్తుంది!)

ఆమె సమక్షంలో గాని, ఆ రమణీప్రియ దూతికలు వింటున్నప్పుడు గాని కృష్ణుడు సత్యభామా విధేయుడుగనే వ్యవహరింపబడాలి. ...హరింపబడకపోతే సత్య ఓర్మి హరింపబడుతుంది. బడి, ఆమెకి ఆగ్రహం వస్తుంది. రాకుండా సంచరించేవాడు కృష్ణుడు. అందుకనే ఆమె "మీరజాలగలడా నా యానతి" అనుకునేది అనేది సరాగంగా!

కాని, కాలగతి వొకలా వుండదు కదా! అడ్డం తిరుగుతునే వుంటుంది

కథ! పురాణ కథ లన్నిటా (యెందుకేనా మంచిది, చాలా పురాణకథలలో) కథ అడ్డం తిరగ డానికి కలహాభోజ బిరుదాంకితు డైన నారద మహామునీంద్రుడు సూత్రధారి అవుతుంటాడు.

సత్యాగ్రహం కథలో కూడా ఆ రివాజే పాటించబడింది నారదుడు కృష్ణుని చూదామని దేవలోకం నుంచి బయల్దేరి వచ్చాడు. మహాత్ముల్ని దర్శించేటప్పుడు రిక్త హస్తాలతో పోరాదు కదా, చేతు లూపుకుంటూ!

పత్రమో, పుష్పమో పట్టుకెళ్ళాలి. ఆకులతో వున్న పువ్వు తీసుకెళ్తే, పత్రమూ పుష్పమూ యిచ్చినట్టుంటుందని, దేవపారిజాతం వొకటి తీసుకుని వచ్చాడు.

సత్యాలోలుడు ఆమె సన్నిధిని కొలువుతీరి వుండలేదు. "మిమ్మల్ని కొలిచే భాగ్యం మాకు అనుగ్రహించం" డని రుక్మిణి అర్థించడం చేత ఆమె కోరిక తీర్చడానికి, ఆమె మందిరానికి వేంచేశాడు. కృష్ణుని వునికి దివ్యదృష్టితో అవలోకించి నారదుడు అక్కడికి అవతరించాడు.

అభివాదములూ, ప్రత్యుత్థానములూ అయేయి. తెచ్చిన పువ్వు కృష్ణుడికిచ్చి, ఇస్తినయ్యా వాయనం అన్నాడు నారదుడు. అందుకుని, పుచ్చుకొంటినయ్యా వాయనం అన్నాడు కృష్ణుడు.

నోము నోచాక, ఉద్యాపన చెప్పాలి కదా! నీకు నచ్చిన వారికి, నీ మది మెచ్చిన వారికి యీ పువ్వు యివ్వాలి సుమా!" అని ఉద్యాపన చెప్పాడు నారదుడు.

వలచి, కొలిచిన పూజాఫలంగా- సరసనవున్న రుక్మిణిని కృష్ణుడు పారిజాతాలంకృతను గావింపగా- నోము పండిన రుక్మిణి పట్టరాని తృప్తితో పరవశించి మురియగా- మురిపించినందుకు నరసిజనాభుడు మురియగా-నారదుడలవోకగా తిన కింక-ఆరగింపు కయ్యం మొదలయే నని వుప్పొంగగా—

ఆ వైనం-కని-సత్యప్రియదూతిక వొక్క- అంగన పోయి-చాటున వుండి-తనువిన్నది- కన్నది- తన నేలిన తరుణికి తగుదునమ్మా యని విన్నవించగా, సత్య,

"మాసిన చీరగట్టుకొని
మౌనము తోడ నిరస్త భూషయై
వాసెన కట్టుగట్టి, నిడు
వాలిక కస్తురి పట్టుపెట్టి లో
గాసిలి, చీకటింటికడ
కంకటిపై, జలదాంత చంద్రరే
ఖా సదృశాంగియై"

—గాథ మనోజ విషాద వేదనతో వుండగా, అక్కడ గవాక్షం వెనుక కనుపించిన దూతిక గవాక్షులు తనకు మరిక కనిపించక పోగా కృష్ణునికి మతి స్థిమితం తప్పింది. ముని నా కిచ్చిన పూవు చందమును, నే మున్నాడి యీ భోజనందన కర్పించిన జాడయుం, తెలియ, చెంతం బొంచి, వీక్షించి, పోయిన సాత్రాజితి బోటి-నావలన తా నేమేమి కల్పించినో" అని విపరీతంగా చలించిపోయాడట.

అతని తాల్మి, "కేతన పటాంచల చంచలం" మైందట! మనస్సు, "తిరిగెడు బండి కండ్ల పగిది" భ్రమించిందట! ఎందుకని? సత్యకి ఆగ్రహం వస్తుందని!.........

.....సత్యాగ్రహోద్యమంవల్ల దేవ పారిజాతం

"వామలోచన కేళీ వనములోన చలువ వెదజల్లు చెంగల్వ కొలనికెలన సరస కర్పూర కదళికా తరులనడుమ బెరటి చెట్టుగ. . . .

—నాటింపబడింది, నాటి న, నాటినుంచే, అలిగి సాధించుకునే వుపాయానికి సత్యాగ్రహం అని పేరు వచ్చింది. ఈ పేరు-ప్రతిష్ఠలు ద్వాపరలో సత్యకి పూర్వమే - కృతయుగం నాటి కైకకి రావలసినవి. కాని ఆవిడ అలకవల్ల అవి విపరీత పరిణామాలు కలగడం చేత ఆ పేరు ప్రతిష్ఠలు ఆవిడకి దక్కలేదు

కారకులు వొకరు కాగా, పేరు మరొకరికి రావడానికి; ఆ యిద్దరికీ కొన్ని సారూప్యాలుండాలి కదా? ఆ ముక్త మాల్యదలో పెద్దన శైలీ, తిరుతెన్నులూ, క్రీడాభిరామంలో శ్రీనాథుని పోకడలూ కనిపించబట్టి కదా, సాహిత్య పరిశోధకులు అనుమానించడానికి ఆస్కారం కలిగింది! అలాగే సత్యాగ్రహానికి గాంధీజీ కాకుండా సత్య కారకురాలు కావడానికి కొన్ని పోలికలు కావాలి కదా? అవి యివి!

కృష్ణుడు రుక్మిణికి పువ్వు యివ్వలేదు. బ్రిటిష్ వాళ్లు మనకి స్వరాజ్యం యివ్వలేదు! సత్యకి ఆగ్రహం వచ్చింది. గాంధీగారికీ వచ్చింది! సత్య ఆగ్రహం వల్ల దేవపారిజాతం లభించింది. గాంధీగారి సత్యాగ్రహం వల్ల స్వరాజ్యం లభించింది!

పుణ్యక వ్రతం వల్ల సత్యకి గర్వభంగ మైందనుకొండి! అధికార వ్యామోహ వ్రతం వల్ల గాంధీగారి ఆశయాలకి భంగం వాటిల్లింది

ఇరువురి చరిత్రలలోనూ యీ సామ్యము లుండడం చేత, పరిశీలకులకు దగ్గర కాలంలో గాంధీగారు గోచరించడం చేత- అలనాటి సత్య ఆగ్రహం విస్మరింపబడి, గాంధీగారి సత్యాగ్రహమే మొదటిదనే భ్రమ చరిత్ర పరిశోధకులకు కలిగించింది. ఆ ఉద్యమానికి ఆయనే మార్గదర్శి అని అపోహ పడ్డారు.

నిలకడ మీద నిజం వెల్లడైంది! సత్య మార్గదర్శి. గాంధీజీ ఆమె అనుయాయి.........! ★